
ప్రజాశక్తి
బుధవారం 24 జనవరి 2024 5 విజయనగరం





గజపతినగరంలో కేక్ తినిపించుకుంటూ సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు




మొక్కు తీర్చుకుంటున్న మహిళ

సిరిమానోత్సవంలో పాల్గొన్న జనం



పోలమాంబ ఉత్సవ విగ్రహం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

- వైభవంగా సిరిమానోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన యాత్రికులు
- గంటన్నర ఆలస్యంగా సిరిమాను ఊరేగింపు
- పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం రాజన్నదొర

జన శంబరం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన దేవతగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి తొలి జాతర వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో సిరిమాను ఊరేగింపు చేపట్టింది. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు లక్షన్నరకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆర్‌డిఒ కె.హేమలత సమన్వయంతో, అడిషనల్ ఎస్పీ సునీల్ సోరెన్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు గంటల ప్రాంతంలో సిరిమానును అధిరోహించాల్సిన పూజారిని చదురు గుడి నుంచి తీసుకెళ్లేందుకు గ్రామ పెద్దలు గుడి వద్దకు రావడంతో పోలీసులు ఎక్కువ మందిని అనుమతించక పోవడంతో స్వల్ప వివాదం జరిగింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై నరసింహమూర్తి వివాదాన్ని సద్దుమణిగింప చేసి కార్యక్రమానికి మార్గం సుగుమం చేశారు. దీంతో సుమారు గంటన్నర ఆలస్యంగా పూజారి జన్ని జగదీష్ సిరిమాను అధిరోహించాల్సి వచ్చింది. ఎప్పటి మాదిరిగానే సావిడి వీధి నుంచి బయలుదేరిన సిరిమానుతో అమ్మవారు కేరళ వారి ఇంటి వద్ద పూజలు అందుకొని అనంతరం కరణం వారి ఇంటి వద్ద నుండి నేరుగా ఎస్సీ వీధి, పనుకు వీధి, గొల్ల వీధుల నుంచి మళ్లీ సావిడి ప్రధాన వీధికి చేరుకుని సిరిమానోత్సవం ముగింపు చేశారు

సజావుగా ప్రయాణాలు

జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. దీంతో చెముడు వైపు వెళ్లే వాహనాలు ఇటు కవిరిపల్లి వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూశారు. గతం కంటే ఈ ఏడాది ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు.

ముమ్మరంగా ఆలయ తనిఖీలు

జాతరకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిమితికి మించి వాహనాల్లో భక్తులను ఎక్కించకుండా నడపాలని ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి తమ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు వ్యక్తిగత, ప్రైవేట్ వాహహనాల్లో ప్రయాణించే వాహన చోదకులు వారు డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్ లు చేయకుండా పర్యవేక్షించారు. జాతర సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తూ పరిమితులు లేని వాహనాలుకు కేసులు కట్టడం ఫ్రంట్ సీటు సిట్టింగ్ కూడా లేకుండా చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రమాదాలు జరగకుండా ముందుగా డ్రైవ్ నిర్వహించడం జరిగింది. స్పెషల్ డ్రైవ్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాలూరు జేవీఎస్ ప్రసాద్, జి సత్యనారాయణ, రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

అందరికీ ధన్యవాదాలు


పోలమాంబ జాతర సజావుగా ప్రశాంతంగా జరిగినందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు దేవాదాయశాఖ ఇఒ వివి సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాస్థాయిలో అన్ని శాఖల అధికారుల నుంచి మండల సచివాలయ అధికారులకు, పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఘటాన్ని తీసుకెళ్తున్న టిడిపి నాయకులు సంధ్యారాణి

రాష్ట్ర జాతరగా..

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు రాజన్నదొరకు పూర్ణకుంభంతో పూలమాల వేసే దేవాదాయశాఖ అధికారులు స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ డిప్యూటీ సిఎం రాజన్నదొర అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క, సారక్క జాతర తరువాత రాష్ట్ర జాతరగా తొలిసారి అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలిసారి అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు.



గోముఖి నది వద్ద, వంతెనపై యాత్రికుల రద్దీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎఎస్‌పి సునీల్ సోరెన్



క్యూలైన్లలో యాత్రికులు

బెదిరింపులకు బెదరకుండా.. నిర్బంధాలను అధిగమించి..

అంగన్వాడీల పోరాట విజయం

జిల్లా వ్యాప్తంగా విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నిర్బంధాలను, అరెస్టులను అధిగమించి.. బెదిరింపులకు, ఎస్మా చట్టాలకు, తొలగింపు ఉత్తర్వులకు బెదరకుండా..42 రోజులు పాటు ఐక్యంగా పోరాడి విజయం సాధించిన అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. అనేక రకాలంగా ప్రభుత్వం, అధికారులు అంగన్వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడినప్పటికీ మొక్కవోని దీక్షతో సమ్మె కొనసాగించి విజయం సాధించారు.

కలెక్టరేట్ సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.పైడిరాజు అధ్యక్షతన మంగళవారం విజయోత్సవ సభ జరిగింది. అంగన్వాడీ యూనియన్ నాయకులతోపాటు సిఐటియు, ఇఫ్టు, ఎఐఎఫ్‌టియు, ఆర్‌టిసి స్టాఫ్‌అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు విజయోత్సవ సూచకగా అభివాదం చేశారు. అనంతరం పైడిరాజు మాట్లాడుతూ 42 రోజులుగా సమ్మెలో ఉన్న తమకు మనోధర్యాన్ని అందించి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతుగా నిలిచిన కార్మిక, ఉపాధ్యాయ ,ఉద్యోగ ,రైతు, విద్యార్థి ,మహిళా, యువజన సంఘాలకు, రాజకీయ పార్టీలకో ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం అంగన్వాడీలది మాత్రమే కాదని, అందరి విజయంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రాణాలకు తెగించి నిరవధిక దీక్షలో పాల్గొన్న రాష్ట్ర నాయకత్వానికి జేజేలు పలికారు. అనంతరం నాయకులు ఎం.శ్రీనివాస, రెడ్డి శంకర్రావు, రెడ్డి నారాయణరావు, జి. అప్పలసూరి, పి.రమణమ్మ, సిహెచ్. వెంకట్రావు, బి.రమణ, సుధారాణి, ఎ.జగన్మోహన్ రావు, వెంకటేష్ , హరీష్ మాట్లాడారు. మొక్కవోని దీక్షతో 42 రోజులు సమ్మె చేసి పోరాడి విజయం సాధించిన అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు అభినందనలు తెలిపారు. పోరాట పటిమ ముందు ప్రభుత్వ బెదిరింపులు, ఎస్మా చట్టం, తొలగింపు ఉత్తర్వులు తుస్సుమన్నాయని కొనియాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు భవిష్యత్తులో ఇదే ఐక్యతను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సభలో విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో అంగన్వాడీలు విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ నిజాయతీగా పోరాడే వారిదే అంతిమ విజయమన్నారు. సమ్మెకు మద్దతిచ్చిన ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గజపతినగరం : గజపతినగరంలో బ్రిడ్జి వద్ద అంగన్వాడీలు విజయోత్సవ సభ నిర్వహించి, కేకు కట్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ 42 రోజులపాటు ఎన్ని నిర్బంధాలకు, బెదిరింపులకు పాల్పడినా తలొగ్గకుండా అంగన్వాడీలు పోరాడి, విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణవేణి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సుభాషిణి, సెక్టార్ నాయకులు నాగమణి, సన్యాసమ్మ, నరసమ్మ, దమయంతి, వాణి, రమణమ్మ పాల్గొన్నారు.

భోగాపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు విజయోత్సవ సభ నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి, అనిత, ప్రవీణ, శ్రీదేవి పాల్గొన్నారు.

బాడంగి : బాడంగిలో అంగన్వాడీలు విజయోత్సవ సభలో కేక్ కటింగ్ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎ.సురేష్, బి.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, రమణమ్మ, సీత ,చంటి, సత్యవతి పాల్గొన్నారు.



విజయనగరంలో అభివాదం చేస్తున్న అంగన్వాడీ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

4న ప్రజ్ఞా వికాస పరీక్ష

టెన్త్ విద్యార్థులంతా హాజరు కావాలని ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజ్ఞా వికాసం పరీక్ష ఫిబ్రవరి 4న నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము,విహెచ్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పరీక్ష లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. పరీక్షలో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ జిల్లా మొదటి స్థానానికి రూ.5,000, రెండో స్థానానికి రూ.3,000, మూడో స్థానానికి రూ.2,000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. మండల స్థాయిలో 300మంది రాస్తే మొదటి మూడు స్థానాలకు మెమెంటోలు ఇస్తామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీ లోపు రూ.25 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకొని హాల్ టిక్కెట్లు తీసుకోవాలన్నారు. పరీక్షల ముందు సినిమా, ఫోన్, సీరియల్స్, క్రికెట్లకు దూరంగా ఉంటూ కాలాన్ని వృథా చేయకుండా ఒక ప్రణాళికను రూపొందించుకొని బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష రాసే విద్యార్థులు ఈ కింది ఫోన్ నెంబర్లను సంప్రదించలన్నారు.

విజయనగరం–93817 68275, 75692 90549
ఎస్.కోట– 79951 07340, 62810 56384
గజపతినగరం– 96762 20612, 77804 69115
బొబ్బిలి – 95025 07945, 79818 81073
చీపురుపల్లి : 99858 25957, 85228 57986
నెల్లిమర్ల : 79935 17081, 72888 49236
రాజాం : 76800 25790
జిల్లా కేంద్రం: 98663 02963,63029 78953, 97055 45164, 94924 14763 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

4,04,031 మందికి వైఎస్ఆర్ ఆసరా

రూ.252.31 కోట్లు జమ

ప్రజాశక్తి-విజయనగరం

వైఎస్ఆర్ ఆసరా పథకంలో భాగంగా జిల్లాలోని 4,04,031 మంది డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి రూ.252.31 కోట్లు జమ చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో, నాల్గవ విడత కింద జిల్లాలోని 36,507 సంఘాలకు నిధులు విడుదల చేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మహిళా సంఘాల సభ్యులకు కలెక్టరేట్ విసి హాలులో అందజేశారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎంఎల్‌సి డాక్టర్ పి.సురేష్‌బాబు, ఎంఎల్ఎలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న సొమ్ముతో స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించి, ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం నాలుగో విడత నిధులను ముఖ్యమంత్రి విడుదల చేశారని చెప్పారు. మూడు విడతలుగా కలిపి సుమారు రూ.754.13 కోట్లను ఇప్పటివరకు పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. నాలుగో విడత కింద మరో రూ.252.31 కోట్లను ఈ రోజు సిఎం విడుదల చేశారని చెప్పారు. అన్ని మండలాల్లో వైఎస్ఆర్ ఆసరా ఉత్సవాలను నిర్వహించి ఈ నిధులను జమ చేస్తామని తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, జెసి అశోక్


కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశకిగీవిజయనగరం టౌన్

ఈనెల 29న జరగనున్న పరీక్షా పే చర్చ కార్యక్రమానికి అనుగుణంగా మంగళవారం కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజయనగరం జిల్లాలోని వివిధ పాఠశాలలనుండి మొత్తం 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల అనంతరం న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఐదుగురి చిత్రలేఖనాలకు గవర్నమెంట్ అఫ్ ఇండియా పంపిన పుస్తకాలను , సర్టిఫికెట్‌లు, బహుమతులను విద్యాలయ ప్రిన్సిపాల్ అందజేశారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లతో పాటు గవర్నమెంట్ అఫ్ ఇండియా పంపిన ఎగ్జాం వారియర్స్ బుక్స్ అందజేస్తామని ప్రిన్సిపల్ దిలీప్ మోడీ తెలిపారు.

బొబ్బిలిలోని సహాయ సాంఘిక సంక్షేమాధికారి కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ప్రతినెలా వార్డెన్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మామ్ముళ్లు ఇవ్వకపోతే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో భయపడుతున్న వార్డెన్లు ప్రతినెలా మామ్ముళ్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.





మూడు నెలల బిల్లులకు గాను ఒక హాస్టల్ నుంచి వసూలు చేసిన డబ్బులు

ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయం అవినీతికి కేరాఫ్

వార్డెన్ల నుంచి ప్రతినెలా అక్రమ వసూళ్లు ● ఇవ్వకపోతే కక్షసాధింపు చర్యలు

ప్రజాశక్తి–బొబ్బిలి

స్థానిక సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలో బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో తొమ్మిది వసతి గృహాలు ఉన్నాయి. బొబ్బిలిలో రెండు, రామభద్రపురంలో ఒకటి, తెర్లాంలో ఒకటి, బాడంగిలో ఒకటి, పెరుమాళిలో ఒకటి, రాజాంలో రెండు, గుల్లసీతారాంపురంలో ఒకటి ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వీటి నుంచి ప్రతినెలా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి నెలకు రూ.3వేలు నుంచి రూ.4వేలు వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తమ కార్యాలయంలో అనధికారికంగా నియమించిన కంప్యూటర్ ఆపరేటర్ వేతనం కోసం అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతినెలా మామూళ్లు జూనియర్ అసిస్టెంట్‌కు లేదా అనధికారికంగా నియమించిన కంప్యూటర్ ఆపరేటర్ చేతికి ఇవ్వాలి. ఒకవేళ వార్డెన్లు అందుబాటులో లేకపోయిన, చేతిలో నగదు లేకపోయినా వీరిలో ఎవరో ఒకరికి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించాల్సిందే. ప్రతినెలా అడిగిన డబ్బులు ఇవ్వకపోతే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎస్‌సి కమిషన్ చైర్మన్, ఎస్‌సి ఎమ్మెల్యేల బృందం పర్యటన ఖర్చులకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి వసతిగృహం నుంచీ డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం.

ఏ నెల మామూళ్లు ఇవ్వకపోతే ఆనెల సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఆయా వసతి గృహాన్ని తనిఖీ చేసి లోపాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలకు అదేశిస్తారని కొంతమంది వార్డెన్లు వాపోతున్నారు.

ఫోన్ పే ద్వారా అక్రమ వసూళ్లు

ప్రభుత్వ వసతి గృహ సంక్షేమ అధికారుల నుంచి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఫోన్ పే ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. ప్రతినెలా అడిగిన డబ్బులు నగదు రూపంలోను లేదా ఫోన్ పే ద్వారా జూనియర్ అసిస్టెంట్ లేదా అనధికారికంగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌కు మామూళ్లు చెల్లించాల్సిందే. 2022 నవంబర్‌లో మూడు నెలల బిల్లులు ఒకేసారి అవ్వడంతో ఆనెల ఒక్కొక్కరు రూ 20వేలు వరకు మామూళ్లు చెల్లించారు. జిల్లా అధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని వార్డెన్లు కోరుతున్నారు.

అక్రమ వసూళ్లలో ఎఎస్‌డబ్ల్యుఒదే కీలకపాత్ర

వసతి గృహాలు నుంచి అక్రమ వసూళ్లలో ఎఎస్‌డబ్ల్యుఒ కీలకపాత్ర పోషిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. విశాఖలో నివాసముంటున్న ఆయన వారానికి రెండు రోజులు మాత్రమే విధులకు వచ్చి మిగిలిన రోజులు విధులకు డుమ్మా కొడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. విధులకు డుమ్మా కొట్టి హాస్టళ్లను విజిట్ చేస్తున్నట్లు రికార్డులో నమోదు చేసి జిల్లా అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

రాజాం మేట్రిన్‌పై కక్షసాధింపు..?

రాజాం కళాశాల బాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న మేట్రిన్‌పై అడిగినంత మామూళ్లు ఇవ్వలేదని ఎఎస్‌డబ్ల్యుఒ కక్షసాధింపు చర్యలకు పాల్పడినట్లు విమర్శలు వస్తున్నాయి. ఆమె ప్రతినెల మామూళ్లు ఇచ్చినప్పటికీ ఒకనెల సకాలంలో ఇవ్వక పోవడంతో డిప్యుటేషన్ పై పని చేస్తున్న ఆమె అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు చేసి ఆమెను సరెండర్ చేయాలని జిల్లా అధికారులను లిఖిత పూర్వకంగా కోరడంతో ఆమెను శ్రీకాకుళం జిల్లాకు సరెండర్ చేసినట్లు తెలిసింది. దీంతో వార్డెన్లు భయపడి ప్రతినెలా మామూళ్లు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫిర్యాదు వస్తే చర్యలు

సహాయ సాంఘిక సంక్షేమ అధికారి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమకు ఎటువంటి ఫిర్యాదులూ రాలేదని సాంఘిక సంక్షేమ శాఖ డిడి బి.రామానందం చెప్పారు. అవినీతిపై ఫిర్యాదు వస్తే సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిట్టంపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి–శృంగవరపుకోట

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఎస్.కోట మండలం చిట్టంపాడులో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా మలేరియా నివారణా అధికారి వై.మణి ఆధ్వర్యంలో చిన్నపిల్లల వైద్య నిపుణులతో సహ డాక్టర్ శిరీష, డాక్టర్ హారికతో కూడిన వైద్యుల బృందం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 48 మంది పురుషులు, 52 మంది మహిళలు, ఇద్దరు గర్భిణులు, ముగ్గురు బాలింతలు, 16 మంది చిన్న పిల్లలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఒక్కరు మాత్రమే మలేరియాతో బాధపడుతున్నట్లు తేలిందని డిఎంహెచ్ఒ తెలిపారు. ఆయనకు మలేరియా చికిత్సను అందించామని, రక్తం తక్కువగా ఉన్న ఇద్దరు గర్భిణులకు ప్రత్యేక చికిత్సను అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. దగ్గు, జలుబుతో బాధ పడుతున్న ఇద్దరు చిన్నారులకు తగిన వైద్య సేవలు అందించినట్లు వివరించారు. గ్రామంలో నీటి నమూనాను తీసుకున్నామన్నారు. గిరిశిఖర గ్రామమైన మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని 16 గ్రామాల్లో ఐదు బృందాలతో ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన వారిని వైద్య శిబిరానికి తరలించి తగిన పరీక్షలను నిర్వహించినట్లు వెల్లడించారు. వైద్య శిబిరం వారం రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.

ఇటీవల చోటు చేసుకున్న మరణాలపై, వైద్య కళాశాల నుంచి ఆర్ఆర్‌టి బృందాన్ని ఏర్పాటు కారణాలను అన్వేషించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరికొందరు వైద్య నిపుణులతో బుధవారం కూడా గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఏస్పిరేషన్ నిమోనియో కారణంగా మరణించిన బాలుడి మృతదేహాన్ని తరలించేందుకు ఎస్.కోట వైద్యాధికారి స్వయంగా, తన సొంత ఖర్చుతో ప్రయివేటు వాహనాన్ని సమకూర్చారని చెప్పారు. మృతదేహంతోపాటు బొడ్డవర గ్రామం వరకు వైద్య సిబ్బంది కూడా వెళ్లారని, ఈ విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించ లేదని వివరణ ఇచ్చారు.



గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

హరిరామజోగయ్యను కలిసిన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్యను పాలకొల్లులోని ఆయన నివాసంలో జనసేన నాయకులు గురాన అయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ అంశాలు, విజయనగరం జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా హరిరామజోగయ్య ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు, ఓటర్ల ప్రభావితం చేసే ముఖ్యమైన అంశాలపై తన అభిప్రాయాలను తెలియజేశారు


మాట్లాడుతున్న తహశీల్దార్ రాజేశ్వరరావు

25న ఓటర్ల దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు సన్మానం చేస్తామన్నారు. సమావేశంలో హెచ్‌డిటి సాయికృష్ణ, ఎన్నికల డిటి గౌరీశంకర్, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు బొబ్బిలి యుద్ధ దినోత్సవం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి యుద్ధ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన తెలిపారు. బొబ్బిలి యుద్ధంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలు త్యాగం చేసిన యుద్ధ వీరులకు యుద్ధ స్తంభం వద్ద నివాళు లర్పిస్తామని చెప్పారు. అనంతరం తూర్పుదేవుడి వద్ద ఉన్న రాజా వారి విగ్రహానికి, తాండ్ర పాపారాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికలకు ప్రజల సహకారం కీలకం

ప్రజాశక్తి-రామభద్రపురం


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజల సహకారం ముఖ్యమని సిఐ తిరుమలరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరికతోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ జ్ఞానప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, పాత కక్షలు చెరిపేసి స్నేహ పూర్వక వాతావరణాన్ని సృష్టించాలని సూచించారు. సమావేశంలో గ్రామ నాయకులు పెంకి భీమయ్య, కనకల ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తెర్లాం

ఇటీవల విజయవాడలో జరిగిన బుక్ ఎక్సిబిషన్‌లో పెరుమాళి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆటోమోటివ్ టెక్నాలజీ కోర్సులో ఉపాధ్యాయులు టి.లక్ష్మణ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి, వారితో అగ్రికల్చర్ రోబోట్‌ను తయారు చేయించారు. వ్యవసాయ సాగులో ఈ రోబోట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కార్తిక్, లలిత్ ఆదిత్య, భరత్, దేవిశ్రీప్రసాద్, ఆసీస్, ఆనంద్‌తోపాటు గైడ్ టీచర్ లక్ష్మణ్‌ను ప్రిన్సిపల్ జ్యోతిలక్ష్మి అభినందించారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

నేడు నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ చెప్పారు. గురుకుల పాఠశాల మైదానాన్ని మంగళవారం ఎంపిడిఒ పి.రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులతో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడా ప్రాంగణంలో తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు.


సుభాష్ చంద్రబోస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం వేదంత్ డెవలపర్స్ కార్యాలయం వద్ద స్థానిక న్యాయవాది, సామాజిక కార్యకర్త తుమరాడ గంగాధర్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మక్కువ మండల అధ్యక్షులు చింతాడ అప్పారావు, ఉపాధ్యాయులు జి రవి, జి సురేష్, కె అశోక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక కోర్టు వద్ద మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు అమలుకు వ్యతిరేకంగా బుధవారం నుంచి ఫిబ్రవరి ఏడో తేది వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌వియస్ గిరిబాబు తెలిపారు. అందులో భాగంగా 25న న్యాయవాదులు మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టి, తహశీల్దార్‌కు వినతి అందించనున్నట్లు చెప్పారు

చేపల చెరువులకు అనుమతులేవి..?


- ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- కలుషితమవుతున్న సాగునీరు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట గ్రామంలో చేపల చెరువులు అనుమతులు లేకుండా యథేచ్ఛగా విస్తరిస్తున్నాయి. స్థానిక మాజీ సర్పంచ్ రాజు అధికారులను ఎదిరించి, బెదిరించి జిరాయితి, డి. పట్టాలు లీజు చేసి చేపల చెరువులుగా మార్చారు. అక్రమంగా ఐదు నుండి ఏడు ఎకరాల్లో ఎటువంటి అనుమతులూ లేకుండా దర్జాగా చేపల చెరువును నిర్వహిస్తూ వ్యాపారం చేసుకుంటూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నాడని గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. మాజీ సర్పంచ్ అక్రమంగా చేపల చెరువు నిర్వహిస్తే మత్స్య, రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా చేపల చెరువు నిర్వహణ చేపట్టడం పట్ల అడిగేవారు లేరనే కదా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తంతు గత ఏడేళ్లుగా జరుగుతున్నప్పటికీ గతేడాది బదిలీపై వచ్చిన తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ఈ విషయం ఆరా తీశారు. దీంతో కొన్ని నెలలు చెరువు నిర్వహణ ఆపివేశారు. అతను బదిలీ అనంతరం యధా స్థితిలో అనుమతులు లేకుండా చేపల చెరువు నిర్వహణ కొనసాగుతుందని గ్రామస్తులే చెబుతున్నారు.

పంట భూములే చెరువులుగా

పంట భూములను చేపల చెరువులుగా మార్చడం ప్రజల నుండి


అనుమతులు లేని చేపల చెరువు ఇదే..

విమర్శలు వెలివెత్తుతున్నాయి. చేపల చెరువుల నుండి వచ్చే కలుషిత నీటిని ఆకుల లోవ కట్టగడ్డ సాగు నీరులో వదలడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ఆ నీటిని పశువులు, పక్షులు తాగడంతో రోగాలు బారిన పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పంట నష్టం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని చెరువులను నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

చేపల చెరువులకి అనుమతులు లేవు



వెంకంపేటలో చేపల చెరువులు విస్తరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. మాజీ సర్పంచ్ బుగత రాజు అనుమతులు లేకుండా చేపల చెరువు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. గత తహశీల్దారు కళ్యాణ్ చక్రవర్తి నియంత్రించినప్పటికీ ఆయన బదిలీపై వెళ్లడంతో యధాతథంగా అనుమతులు లేకుండా నిర్వహణ జరుగుతుంది. చెరువు నిలుపుదల నిర్వహణకు ప్రస్తుత తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకుంటాం.

ప్రసాద్, మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి, రాజాం

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం



వెంకంపేటలో అనుమతులు లేకుండా చేపల చెరువు నిర్వహణపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. పంట భూముల్లో చేపల చెరువు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. మత్స్య శాఖ ఫిర్యాదు మేరకు శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

బి. సుదర్శన్ రావు, తహశీల్దార్ రేగిడి

భీమిలి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-తెర్లాం

ఈ నెల 27న భీమిలిలో జరిగే వైసిపి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. స్థానిక రామకృష్ణ థియేటర్ ఆవరణలో మంగళవారం వైసిపి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావాన్ని సిఎం జగన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్‌పిటిసి గర్బాపు రామారావు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి చీపేన సత్యనారాయణ, అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షులు మదాసు శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : ఈ నెల 27న భీమిలిలో జరగనున్న వైసిపి ఉత్తరాంధ్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ సమీపంలో ఉన్న


తెర్లాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

వెంకటసాయి కళ్యాణ మండపంలో వైసిపి మండల విస్తృత సమావేశం మంగళవారం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 27న జరగబోయే సమావేశానికి పార్టీ క్యాడర్ అంతా సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి యద్ల కిశోర్‌కుమార్, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల , హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గుమ్మడి స్వాతిరాణి , మాజీ సర్పంచ్ డేగల సాయిలక్ష్మి, మండల యువజన విభాగం అధ్యక్షులు తూర్పాటి అప్పలరాజు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రానున్న ఎన్నికల సమయంలో ప్రతి పక్ష పార్టీల నాయకులు ముసుగులేసుకొని ఓట్లడిగేందుకు గ్రామాలలోనికి వస్తారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైసిపి అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం చీపురుపల్లి వైసిపి కార్యాలయంలో జరిగిన నాలుగు మండలాల కార్యకర్తల సమావేశంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌తో కలసి ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బొత్స సత్యనారాయణను గెలిపించాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. భీమిలి నియోజకవర్గం తగరపువలస వేదికగా సిద్ధం అనే నినాదంతో ఈ నెల 27వ తేదీన ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు సీఎం జగన్ వస్తున్నారని ఆ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-చీపురుపల్లి

స్థానిక వైయస్ఆర్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో వైయస్ఆర్ ఆసరా 4వ విడత నిధులు జమ చేసిన సందర్భంగా మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలు సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలబిషేకం చేశారు. వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వరుసగా నాలుగో ఏడాది వైయస్ఆర్ ఆసరా కార్యక్రమం బటన్ నొక్కి నేరుగా పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నగదు జమ చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పతివాడ రాజారావు, సొసైటీ మాజీ అధ్యక్షులు రేవళ్ళ సత్తిబాబు, శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్, ఏపీఎం అన్నపూర్ణ, సిసిలు గోవింద, నారాయణమ్మ, విఒలు, మహిళా సంఘ ప్రతినిధులు, మహిళాలు పాల్గొన్నారు.

బూరిపేటలో జెఎఎస్ శిబిరం

ప్రజాశక్తి-తెర్లాం


తెర్లాం: వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

మండలంలోని బూరిపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ సందర్శించారు. వైద్యం ఏ విధంగా అందిస్తున్నారని అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: ప్రజల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని జెడ్‌పిటిసి గార తవుడు అన్నారు. మంగళవారం మండలంలోని కెంగువ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఎంపిపి ప్రతినిధి బెల్లాన త్రినాధరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి ఇంటికీ డాక్టర్‌ను పంపి వైద్య సేవలు నిర్వహిస్తున్న ఘనత వైసిపిదేనని అన్నారు. మొత్తం 400 మందికి పలు రకాల వైద్య సేవలు అందించారు అవసరమైన వారికి వైద్య పరీక్షల నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి పంపించామని డాక్టర్ సుష్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల సూరప్పడు, వైసిపి నాయకులు లెంక.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వాసవి క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా నూతన కమిటీ ఏర్పాటయింది. ఎన్నికైన కొత్త కమిటీ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరభద్రస్వామి మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఈ క్లబ్ ద్వారా ఆర్యవైశ్యులకు, సమాజ హితానికి అనేక ప్రయోజనకర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పూర్వం నుంచి వస్తున్న గౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రవికుమార్, జిల్లా గవర్నర్ ఎ.సాంబమూర్తి, పూర్వ అధ్యక్షులు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వాసవి క్లబ్ అధ్యక్షులు జనార్దన్ రావు, కార్యదర్శి రత్నారావు, కోశాధికారి విన్నకోట రమేష్, విజయ్ కుమార్, ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, గుప్తా పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన జనసేన కార్యకర్తలు

నగరంలోని గాజులరేగ ప్రాంతానికి చెందిన 50 మంది జనసేన కార్యకర్తలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ వైసిపి చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై అనేకమంది ఈరోజు పార్టీలోకి చేరడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. గాజులరేగ ప్రాంతంలో రహదారులు, ఆసుపత్రి, వాటర్ ట్యాంక్ నిర్మాణంతో పాటు పైప్ లైన్ ఏర్పాట్లు కూడా ముమ్మరంగా చేపట్టామన్నారు. పెద్ద చెరువును అభివృద్ధి చేసి బోటు షికారు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కేదారశెట్టి సీతారామమూర్తి, యువజన అధ్యక్షుడు అల్లు చాణిక్య, నడిపల్లి ఆదినారాయణ, కనుగల రాజా,జమ్మాన శ్రీనివాస్, గార సత్యనారాయణ, బోడ సింగి ఈశ్వరరావు,జమ్ము మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం చీపురుపల్లిలో ఘనంగా జరిగాయి. స్థానిక కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు చేశారు. ఈ సందర్భంగా భారీ కేకును నాగార్జున కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రానికి నారా లోకేష్ లాంటి యువనాయకత్వం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, తిరుమల రాజు కిరణ్ కుమార్ రాజు, దన్నాన రామ చంద్రుడు, చనమల మహేశ్వర రావు, తాడ్డే సన్యాసినాయుడు, సారేపాక సురేష్ బాబు, రెడ్డి గోవింద, బలగం వెంకటరావు, మహంతి అప్పలనాయుడు, మండల


చీపురుపల్లి: కేక్ కట్ చేస్తున్న నాగార్జున

చంటి, కెంగువ ధనుంజయ పాల్గొన్నారు.

విజయనగరంకోట: స్థానిక అశోక్ బంగ్లాలో మంగళవారం లోకేష్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇంఛార్జి అధితిగజపతిరాజు కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిఎంటి, సీతం మధ్య ఎంఒయు

ప్రజాశక్తి- విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాల, తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. సీతం ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామ మూర్తి, తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు మిస్టర్ ఎ.వినీల్ జడ్సన్ ఎంఒయుపై సంతకం చేశారు. ఉపగ్రహాలు, కక్ష్య వాహనాల ఉప వ్యవస్థలకు సంబంధించిన భాగాల రూపకల్పన, విశ్లేషణ, అనుకరణలు, ధ్రువీకరణలు, అభివృద్ధి కోసం సహకరించుకోవడం, పని చేసే నిబంధనలు, షరతులపై చర్చించారు. ఈ సందర్భంగా సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ క్యూబ్‌శాట్‌ల రూపకల్పన, అభివృద్ధికి సీతం విద్యార్థులు, ఫ్యాకల్టీకి ఇది దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టిడివిఎ నాయుడు, డీన్ డాక్టర్ వై. నరేంద్ర, ఎయు ఇఇ డిపార్టు మెంట్ హెడ్ పి మలికార్జు నరావు తదితరుల పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రెడ్డికంచేరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ ట్యాబులను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ బైరెడ్డి రమణా రెడ్డి చేతుల మీదుగా 8వ తరగతికి చెందిన 47 మంది విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ ట్యాబులను సక్రమంగా ఉపయోగించుకోవాలని సర్పంచ్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శీరపు నర్సింగ్ రావు, వైస్ చైర్మన్ పద్మ, నాయకులు వంశీరెడ్డి, నర్సింగ్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి వల్లంపూడి జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రంలో జంట గ్రామాల్లో ఒకటైన వల్లంపూడిలో బుధవారం నుంచి జాతర సందడి ఆరంభం కానుంది. మూడు రోజులపాటు సాంబశివుని జాతర జరగనుంది. జాతర సందర్భంగా కోలాటం, పులివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు ఏర్పాటు చేస్తున్నారు.

లెండీలో 'మిషన్ 45 డేస్'

ప్రజాశక్తి- డెంకాడ


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న బిశ్వజీత్

మారుతున్న పరిస్థితులకు, వాతావరణాలకు అనుగుణంగా యువత మార్పు చెందాలని డిఆర్‌డిఒ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ డాక్టర్ బిశ్వజీత్ చౌబే అన్నారు. స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పర్సనాలిటీ డెవలప్మెంట్ తరగతులలో భాగంగా మంగళవారం 'యూత్ టు లీడ్ అండ్ మిషన్ 45 డేస్' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేవలం 45 రోజుల్లోనే 7 అంతస్తుల భవనాన్ని పూర్తి చేయడంతో పాటు విద్యార్థులను నాయకత్వం, ఆవిష్కరణల వైపు ప్రోత్సహించవలసి ఉందని చెప్పారు. సాంకేతిక విద్య పట్ల నిబద్ధతకు ప్రతీకగా డాక్టర్ చౌబే క్యాంపస్‌లో కొత్త లాంగ్వేజ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ ల్యాబ్‌లు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతా యన్నారు. కళాశాల చైర్మన్ పెద్దిరెడ్డి మధుసూద నరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోడూరు శివరామకృష్ణ, పాలకమండలి సభ్యుడు పెద్దిరెడ్డి రాజీవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, ఇతర ఉపాధ్యాయ బృందాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

428 మందికి కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి


కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మండలంలోని దేవుదల గ్రామంలో సంకిలి ఈఐడి ప్యారి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడకు చెందిన ఫ్రీ ఐ కేర్ ఆఫ్తాల్మిక్ వైద్యులు కృష్ణమూర్తి బృందం 550 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించింది. వీరిలో 428 మందికి మందులు, కళ్ళ జోళ్లను హెచ్ఆర్ హెడ్ మురళీకృష్ణ, సర్పంచ్ దుర్గమ్మ, గవరయ్య, ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంకిలి ప్యారి షుగర్ పరిధి చుట్టుపక్కల గ్రామ ప్రజలకు వైద్య సేవలు, కళ్ళజోళ్ళు పంపిణీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా చేస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం పట్ల ప్యారి యాజమాన్యాన్ని చుట్టుపక్క గ్రామ ప్రజలు, పెద్దలు అభినందించారు. వీరితోపాటు షుగర్ సిబ్బంది స్వామి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ఉద్యోగులు మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యుత్ ఘాతంతో జూనియర్ లైన్ మెన్ మృతి చెందారు. మంగళవారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం గుషిని సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రెడ్డి కోటారావు (27) విద్యుత్ స్తంభం మీద కొత్త ట్రాన్స్ ఫార్మర్ లైన్ కలుపుతుండగా హెచ్‌టి లైన్ తీగలు తగలడంతో షాక్‌తో కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎఇ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.


మృతి చెందిన కోటారావు

జామిలో విషాద ఛాయలు

జామి: జామి గ్రామానికి చెందిన రెడ్డి కోటారావు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. జామి కొత్తల వీధికి చెందిన సన్యసప్పుడు, కృష్ణమ్మ దంపతులకు ఏకైక సంతానంగా పుట్టిన కోటారావు గుషిణిలో విద్యుత్తు షాక్‌తో మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా చేసిన అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుమారుడు శవమై రావడంతో ఆ తల్లిదండ్రులు రోదనలు మిన్నంటుతున్నాయి.

బస్సు ఢీకొని ఎఇఒ

వంగర: విధులు ముగించుకొని బైక్ పై సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారి (ఎఇఒ) గొర్లె సత్యనారాయణ (35) మృతి చెందారు. ఈ ఘటన రాజాం పట్టణం బొబ్బిలి సెంటర్లో మంగళవారం జరిగింది. దీంతో మృతుడి స్వగ్రామం వంగర మండలం ఎం సీతారాంపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈయన రాజాం మండలంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారిగా పనిచేస్తున్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఇందిర వంగర మండలంలోని మద్దివలస సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తోంది. వీరికి మూడు, ఆరు సంవత్సరాల గల ఇద్దరు ఆడపిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన సత్యనారాయణ